సాక్షి నంద్యాల

శనివారం । 1 । జూన్ । 2024



తండ్రి చేతిలో కొడుకు హతం

మద్యానికి డబ్బులు ఇవ్వాలని వేధిస్తుండడంతో కోపోద్రిక్తుడైన తండ్రి కుమారుడిని హతమార్చాడు. ఈ ఘటన శుక్రవారం దొర్నిపాడులో చోటుచేసుకుంది. 10లో▸



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల పూజలు చేపట్టారు.



చుక్క నీటికి.. చక్కటి ఫలితం

తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తోంది. ఇందులో భాగంగా బిందు సేద్యం పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తోంది. 10లో▸

న్యూస్‌రీల్

పొగాకు ఆరోగ్యానికి చేటు



వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాలటౌన్: పొగాకు వినియోగించే వారికే కాకుండా వారి పక్కనుండే వారి ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కార్యాలయం నుంచి సాయిబాబానగర్ ఆర్చ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా పొగాకు ద్వారా క్యాన్సర్ బారిన పడి వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, హానికర పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగంలో స్వల్పంగా తగ్గుదల ఉన్నప్పటికీ ప్రతి సంవత్సరం టొబాకో పదార్థాల వల్ల మరణాల రేటు పెరుగుతూ ఉందన్నారు. పొగాకు పదార్థాలను వాడటం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పక్షవాత, శ్వాసకోశ వ్యాధులు వస్తాయన్నారు. ఈ సంవత్సరం పొగాకు ఇండస్ట్రీల నుంచి చిన్నపిల్లలను కాపాడాలి అనే నినాదం ద్వారా ప్రపంచ పొగాకు దినోత్సవం జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ శారద బాయి, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు నాయక్, డాక్టర్ సునీత, డీఐఓ డాక్టర్ ప్రసన్నలక్ష్మి, ఆయుర్వేదిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోద, నేషనల్ టొబాకో కంట్రోల్ నిర్వహణ కోఆర్డినేటర్ చిన్న వీరన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీనిధి బకాయిలు రూ. 5 కోట్లు

ఉయ్యాలవాడ: నంద్యాల జిల్లాలోని 29 మండలాల్లో స్త్రీనిధి ద్వారా పొదుపు మహిళలు తీసుకున్న రుణాల్లో మొండి బకాయిలుగా రూ. 5 కోట్లు ఉన్నాయని వైఎస్‌ఆర్ క్రాంతి పథం జిల్లా అసిస్టెంటు మేనేజర్ నాగ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉయ్యాలవాడలో వైఎస్‌ఆర్ క్రాంతి పథం కార్యాలయంలో సెర్ప్ రికవరీ టీమ్‌తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో స్త్రీనిధి ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని పొదుపులక్ష్మి గ్రూపు మహిళలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ. 115 కోట్లు రుణాలు అందజేసిందన్నారు. ప్రతి మండలంలో వారం రోజుల పాటు సెర్ప్ టీమ్ సభ్యులు గ్రామాల్లోని పొదుపు మహిళలతో సమావేశమై బకాయిల రికవరీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉయ్యాలవాడ కార్యాలయం పరిధిలో రూ. 50 లక్షలు రికవరీ చేయాల్సి ఉందన్నారు. పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, తుడుములదిన్నె, సర్వాయిపల్లె, ఆర్.పాంపల్లె వీఓఏల పనితీరు సరిగా లేదని, వీరిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పీడీకి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం దాస్, సీసీలు గంగన్న, నాగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

1,582 మంది గైర్హాజర్

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో శుక్రవారం జరిగిన పదవ తరగతి సప్లిమెంటరీ సాంఘిక శాస్త్రం పరీక్షకు 1,582 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. 2,455 మంది విద్యార్థులకు గాను 873 మంది హాజరయ్యారన్నారు. 27 పరీక్ష కేంద్రాల్లో పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సజావుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు పది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయన్నారు.

మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): రోహిణి కార్తె ప్రభావం ఉమ్మడి జిల్లాలో స్పష్టంగా కనబడుతోంది. మొన్నటి వరకు చల్లబడిన వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. శుక్రవారం ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. కర్నూలు జిల్లాలో 10, నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 40 డిగ్రీలు ఆపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో అత్యధికంగా నందికొట్కూరులో 42.5, పాణ్యంలో 42.4, అవుకులో 42.2 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లాలో కర్నూలు నగరంలో 42, మంత్రాలయంలో 41.1, కౌతాళంలో 41.0 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఐదుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం ఐదుగురు డిబార్ అయినట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 3,156 మందికి 2893 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. డోన్ జీవీఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శంకరాస్ డిగ్రీ కళాశాల, బేతంచెర్ల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల, సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల కేంద్రాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఐదుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

ఎగ్జిట్ ఉత్కంఠ



సార్వత్రిక సమరం చివరి అంకానికి చేరుకుంది. మన రాష్ట్రంలో నాలుగో విడతలో భాగంగా మే 13న పోలింగ్ ముగిసినా దేశ వ్యాప్తంగా పార్లమెంట్ స్థానాలకు మరో మూడు దశల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. దీంతో సర్వే సంస్థలు, టీవీ ఛానెళ్లు ఎగ్జిట్ పోల్స్ ప్రకటించలేదు. చివరిదశ పోలింగ్ నేడు(శనివారం) ముగియనుంది. సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగుస్తుంది. దీంతో 6.30 గంటల తర్వాత ఎగ్జిట్‌పోల్స్‌ను సర్వే సంస్థలు వెల్లడించనున్నాయి. దీని కోసం బెట్టింగ్ రాయుళ్లు, రాజకీయపార్టీల నేతలు, ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కౌంటింగ్ నాలుగో తేదీన ఉన్నప్పటికీ ఎగ్జిట్‌పోల్స్‌తో గెలుపోటములపై ఓ అంచనా వచ్చే అవకాశం ఉంది. దీంతో అందరిలోనూ 'ఎగ్జిట్' ఉత్కంఠ నెలకొంది. – సాక్షిప్రతినిధి కర్నూలు

- దేశ వ్యాప్తంగా సార్వత్రిక పోరులో చివరిదశ పోలింగ్ నేడే
- 6 గంటలకు ముగియనున్న పోలింగ్
- ఆపై ఎగ్జిట్‌పోల్స్‌ను ప్రకటించనున్న సర్వే సంస్థలు
- ఎగ్జిట్‌పోల్స్ కోసం ప్రజలతో పాటు రాజకీయపార్టీలు, నేతలూ ఎదురుచూపులు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో జోరుగా బెట్టింగ్‌లు
- ఎగ్జిట్‌పోల్స్ తర్వాత మరింత జోరందుకోనున్న బెట్టింగ్‌లు
- ఈ నెల 4న కౌంటింగ్‌తో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

సార్వత్రిక సమరంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలకు ఈ నెల 13న పోలింగ్ జరిగింది. పోలింగ్, కౌంటింగ్‌కు 22 రోజులు గడువుంది. ఈ మధ్యలో జిల్లాలో జోరుగా బెట్టింగ్‌లు జరిగాయి. 14 అసెంబ్లీలలో అభ్యర్థుల విజయావకాశాలను బట్టి అభ్యర్థులు ఎవరికివారు లెక్కలు వేసుకుని ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు. కొంతమంది పోలింగ్‌రోజే ఎగ్జిట్ పోల్స్ చేయించారు. మరికొందరు పోలింగ్ ముగిసిన తర్వాత పోలింగ్‌బూత్‌ల వారీగా ఏజెంట్లు, ముఖ్యనేతలను పిలిపించుకుని బూత్‌ల వారీగా ఎన్ని ఓట్లు పోలై ఉంటాయనే లెక్కలు వేసుకున్నారు. ఆపై అభ్యర్థులు, ముఖ్యనేతలు వారి పరిధిలో పరిచయం ఉన్న మీడియా ప్రతినిధులు, సర్వేసంస్థల ప్రతినిధులను కలిసి ఓ అంచనాకు వచ్చారు. దీని ప్రకారం బెట్టింగ్‌లు కాశారు.

ఉమ్మడి జిల్లాలో రూ. వంద కోట్లకుపైగా బెట్టింగ్‌లు

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై గతంలో ఏ ఎన్నికల్లో లేని విధంగా బెట్టింగ్‌లు నడిచాయి. గత నాలుగు ఎన్నికల ఫలితాలు, ఈ దఫా జరిగిన పోలింగ్‌ను బట్టి రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధిక స్థానాలు వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ కైవసం చేసుకుంటుందనే అభిప్రాయం ప్రజలతో పాటు రాజకీయపార్టీల్లో కూడా స్పష్టత ఉంది. అయితే ఏ అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ గెలుస్తుంది? ఎక్కడ టీడీపీ గెలుస్తుందనే అంశంలోనే అందరిలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ అంశమే బెట్టింగ్‌లు భారీగా కాసేందుకు ప్రభావం చూపింది. ఫలానా అసెంబ్లీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ గెలుస్తుందంటే, లేదు అక్కడ టీడీపీ గెలిచే అవకాశం ఉందని బెట్టింగ్‌లకు సిద్ధమయ్యారు. బెట్టింగ్‌లు చాలా రకాలుగా జరిగాయి. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది? ఏ ఎమ్మెల్యే గెలుస్తాడు? ఎంత మెజార్టీతో గెలుస్తారు? ఉమ్మడి జిల్లాలో ఏ పార్టీ ఎన్ని స్థానాలు గెలుస్తుంది? ఇలా రకరకాలుగా బెట్టింగ్‌లు కాశారు. మెజార్టీ వ్యక్తులు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని, మెజార్టీ స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని బెట్టింగ్ నిర్వహించారు. అప్పటి వరకూ 1:1 లెక్కన బెట్టింగ్ జరిగింది. పల్లెల్లో రూ.50వేలు, లక్ష నుంచి ఓ స్థాయి నాయకులు రూ.10లక్షలు, రూ.50లక్షలు బెట్టింగ్ కాశారు. మరికొందరు గుంపుగా ఏర్పడి రూ.కోటి, 2కోట్లు కూడా బెట్టింగ్ కాశారు.

రెండు జిల్లాలలో ఈ సీట్లపైనే భారీ బెట్టింగ్



కర్నూలు జిల్లాలో ఒక అసెంబ్లీ స్థానంపై అత్యధికంగా బెట్టింగ్ నడిచింది. ఆ తర్వాత మరో రెండు అసెంబ్లీలపై కూడా పందేలు కాశారు. అలాగే నంద్యాల జిల్లాలో రెండు అసెంబ్లీలపై భారీగా బెట్టింగ్ నడిచింది. ఇవి కాకుండా మరో రెండు అసెంబ్లీ ఫలితాలపై కూడా అత్యధికంగా బెట్టింగ్‌లు కాశారు. ఇప్పటికే సోషల్ మీడియాలో కొన్ని సంస్థలు తమ పేర్లతో ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేశాయి. అయితే నేటి సాయంత్రం పోలింగ్ ముగియడంతో ఎగ్జిట్‌పోల్స్‌పై నిషేధం తొలగిపోతుంది. ఎగ్జిట్‌పోల్స్ తర్వాత కూడా బెట్టింగ్‌లో మార్పులు, చేర్పులు ఉండటంతో పాటు ఈ రెండు రోజుల్లో కూడా మరింత ఊపందుకునే అవకాశం ఉంది.

సీఎం వ్యాఖ్యల తర్వాత మారిన తీరు

పోలింగ్ ముగిసిన తర్వాత తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాబోతోందని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. ఆపై నాలుగురోజులకు 151 అసెంబ్లీ, 22 పార్లమెంట్‌ల కంటే అధిక స్థానాలు గెలువబోతున్నామని ఓ సందర్భంలో వ్యాఖ్యానించారు. ఇదే అందరిలోనూ గుబులు రేకెత్తించింది. పక్కా సమాచారం లేకుండా సీఎం వ్యాఖ్యానించరని, కచ్చితమైన రిపోర్టులతోనే ఈ ప్రకటన చేశారని అంతా భావించారు. ఈ ప్రకటనల తర్వాత చాలామంది బెట్టింగ్‌లు వెనక్కి తీసుకున్నారు. అయితే తర్వాత నాలుగైదురోజులకు బెట్టింగ్ నిర్వాహకులు వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య 1:2, 1:3 లెక్కల బెట్టింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు అంశంలోనూ ఈ రకమైన పందమే జరిగింది. దీంతో చాలామంది టీడీపీ నేతలు, బెట్టింగ్‌రాయుళ్లు పోతే ఒకటే, గెలిస్తే 2, 3 రెట్లు డబ్బు వస్తుందని పందెం కాశారు. దీంతో తిరిగి పందేలు ఊపందుకుని రూ.100 కోట్లకుపైగా జరిగి ఉంటాయని తెలుస్తోంది. కొందరు పొలాలు, స్థలాలు కూడా పందెం కాశారు. మరి కొంతమంది యువకులు విదేశీ పర్యటనల ఖర్చును బెట్టింగ్ కాశారు. అయితే నగదుపై జరిగిన బెట్టింగ్ ఎక్కువగా ప్రొద్దుటూరు, విజయవాడ, గుంటూరుతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి ప్రాంతంలోని వ్యక్తులు మధ్యవర్తులుగా వ్యవహరించారు. వీరితో పాటు హైదరాబాద్ కేంద్రంగా కూడా ఇక్కడి వ్యక్తులు బెట్టింగ్ కాచారు. రెండువైపుల నగదును హైదరాబాద్‌లోని మధ్యవర్తులకు ఇచ్చారు.

నేటి నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ



నంద్యాల(న్యూటౌన్): జూన్ నెలకు సంబంధించి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం శనివారం నుంచి మొదలు కానుంది. మే నెల తరహాలోనే 25 శాతం పింఛన్లు డోర్‌టుడోర్ పంపిణీ చేస్తుండగా... 75 శాతం పింఛన్లను డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు. జూన్ నెలకు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాకు 4,67,389 పింఛన్లు పంపిణీ చేయనున్నారు. వికలాంగులు, డీఎంహెచ్‌వో, కిడ్నీ రోగులు, వీల్‌చైర్, బెడ్‌కు పరిమితమైనవారు, సైనిక్ వెల్ఫేర్ పింఛన్‌దారులకు ఇంటిదగ్గరే పింఛన్లు పంపిణీ చేస్తారు. ఇంటి దగ్గరే పింఛన్లు పంపిణీ చేసేందుకు ఉమ్మడి జిల్లాకు శుక్రవారం రూ.34,45,03,500 నగదు బ్యాంకులకు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని గ్రామ, వార్డు సచివాలయాల సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలకు రూ.104,95,11,00 విడుదల కానుంది. శనివారం డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్ము విడుదల అవుతుంది. శనివారం నుంచి పింఛన్‌దారుల బ్యాంకుల నుంచి నగదు పొందవచ్చని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు, కుతంత్రాల కారణంగా జూన్ నెలలో కూడా 3.50 లక్షల మంది పింఛన్‌దారులు సుదూర ప్రాంతాల్లోని బ్యాంకుల మెట్లు ఎక్కాల్సి వచ్చింది. దాదాపు ఐదేళ్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి దగ్గరే వలంటీర్ల ద్వారా లబ్ధిదారులు పింఛన్ పొందుతూ వచ్చారు. చంద్రబాబు ముఠా కారణంగా పాత రోజుల నాటి కష్టాలు పునరావృతం అయ్యాయి.

జూన్ నెల పింఛన్ పంపిణీ వివరాలు..

జిల్లా	మొత్తం పింఛన్లు	పంపిణీ చేసే మొత్తం (రూపాయల్లో)	డోర్‌టుడోర్ పంపిణీ చేసే మొత్తం(రూపాయల్లో)
కర్నూలు	2,45,687	73,53,37,000	18,77,08,000
నంద్యాల	2,22,702	65,86,77,500	15,67,95,500
మొత్తం	4,67,389	139,40,14,500	34,45,03,500

ఈటీపీబీఎంఎస్‌ను పకడ్బందీగా లెక్కించాలి



ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈటీపీబీఎంఎస్) ద్వారా వచ్చిన ఓట్లను పకడ్బందీగా లెక్కించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పాణ్యం మండలం నెరవాడ గ్రామ సమీపంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఈటీపీబీఎంఎస్ పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు విధానంపై ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్ వైజర్లకు కౌంటింగ్ అసిస్టెంట్‌లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసు ఓటర్లు వినియోగించుకున్న ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ పోస్టల్ బ్యాలెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈటీపీబీఎంఎస్) ఓట్ల లెక్కింపుకు సంబంధించి ప్రత్యేకంగా టేబుళ్లను, స్కానర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈటీపీబీఎంఎస్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఏకకాలంలో జరుగుతుందన్నారు. ముందుగా ఫారం 13సీలోని కవర్ తెరిచి, కవరు బయట ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఒకదాని తర్వాత ఒకటి లెక్కించాలన్నారు. క్యూఆర్ కోడ్ చెకింగ్ వల్ల ఎటువంటి డూప్లికేట్ ఓట్లకు అవకాశం ఉండదన్నారు. మొదటిది ఫామ్ 13సీ బయటకు కవరు, రెండవది ఫారం 13ఏ ఓటరు డిక్లరేషన్ ఫామ్, మూడవది పోస్టల్ బ్యాలెట్ ఉన్న ఫారం 13బీ కవరును వరుస క్రమంలో స్కాన్ చేస్తారన్నారు. కవరు–13సీలో ఉన్న పోస్టల్ బ్యాలెట్ పేపర్ (ఫారం 13బీ)ను తెరవబోయే ముందు రిటర్నింగ్ అధికారి 13ఏ (ఓటర్ డిక్లరేషన్ ఫారం) సరిచూసుకోవాలన్నారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి
- ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీసుల అలర్ట్
- శాంతిభద్రతల పరిరక్షణకు మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరైన శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైతే అల్లరి మూకను ఏ విధంగా అదుపు చేయాలనే అంశంపై శుక్రవారం నంద్యాల శ్రీనివాస సెంటర్‌లో జిల్లా పోలీసులు మాబ్ ఆపరేషన్– మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు అనంతరం ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక చర్యలు చోటు చేసుకుంటే ఎటువంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందనే విషయాన్ని మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించామన్నారు. అల్లరి మూకలను తరిమికొట్టడం, విధ్వంసానికి ప్రయత్నించే వారిని అణచివేయడం, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడం, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడం వంటి సన్నివేశాలు ప్రదర్శించామన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని, అలాగే సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ కూడా అమలులో ఉందన్నారు. మాక్ డ్రిల్‌లో భాగంగా శ్రీనివాస సెంటర్, గాంధీ చౌక్, ముల్లాన్ పేట, ఆత్మకూరు బస్‌స్టాండ్, ఫరూక్ నగర్, సిటీ బస్‌స్టాండ్, పద్మావతి నగర్, టెక్కె ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

మాక్ డ్రిల్ ఇలా ..

అల్లరి మూకల మధ్య గొడవలు జరగడం, పోలీసులు అడ్డుకోవడం వంటి సన్నివేశాల్లో కల్పిత పాత్రలతో పోలీసులు పాల్గొన్నారు. ఓ వైపు ఆందోళనకారులుగా రాళ్లు విసిరితే.. మరో వైపు అల్లరి మూకలపై పోలీసులు టియర్ గ్యాస్, తుపాకులతో ఫైరింగ్, వజ్ర వాహనంతో ఫైరింగ్, లాఠీచార్జీ చేశారు. ఈ సందర్భంలో అల్లరిమూకల్లో ఇద్దరు కిందపడి గాయపడటం, వారిని స్ట్రెచర్‌పై అంబులెన్సులోకి చేర్చడం, ఆసుపత్రికి పోలీసులు తరలించే దృశ్యాలు ఆసక్తికరంగా కనిపించాయి. అల్లరిమూకలు ఘర్షణలకు దిగితే పోలీసుల చర్యలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు రోజు హింసాత్మక ఘటనలు జరగకుండా కట్టుదిట్ట మైన భద్రత ఏర్పాట్లలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్, నంద్యాల టౌన్ డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, నంద్యాల సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు నరసింహులు, చలపతి, రాజారెడ్డి, శివకుమార్ రెడ్డి, దస్తగిరి బాబు, ఇస్మాయిల్ ఆర్మ్డు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సబ్ ఇన్‌స్పెక్టర్లు మల్లికార్జున, వెంకటసుబ్బయ్య నవీన్ బాబు, స్పెషల్ పార్టీ సిబ్బంది స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వో, ఆర్‌ఐకి మెమో

పగిడ్యాల: శ్రీశైలం బ్యాక్ వాటర్ మునక భూముల్లో నల్లమట్టిని ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల నివేదిక ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన నెహ్రూనగర్ వీఆర్వో వెంకటస్వామి, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ చంద్రమౌళికి మెమో జారీ చేసినట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మట్టి తరలించే ట్రాక్టర్ యజమానులు, కమిషన్ ఏజెంట్‌పై ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు ఆ పని చేయలేదని, అందుకే ఇద్దరికీ మెమోలు జారీ చేశామన్నారు. వారి నుంచి వివరణ తీసుకున్న అనంతరం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

రేషన్ కార్డు దారులకు జొన్నలు, రాగుల పంపిణీ

నంద్యాల (అర్బన్): జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా బియ్యంతో పాటు సబ్సిడీ ధరపై చక్కెర, 3 కేజీలు చొప్పున జొన్నలు, రాగులు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలలాగే ఈ నెల కూడా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌ను ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నామన్నారు. మార్చి నెల నుంచి బియ్యం బదులు 3 కిలోల వరకు జొన్నలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. మే నెలలో 533.182 మెట్రిక్ టన్నుల జొన్నలను పంపిణీ చేశామన్నారు. కార్డుదారులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గిరిజనులు పండ్లతోటలు సాగు చేయాలి



పెద్దగుమ్మడాపురంలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న స్టేట్ ట్రైబల్ ప్రాజెక్ట్ మేనేజర్ నారాయణరెడ్డి, ఐటీడీఏ అధికారులు

- స్టేట్ ట్రైబల్ ప్రాజెక్ట్ మేనేజర్ నారాయణ రెడ్డి

కొత్తపల్లి: గిరిజనులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించి జీవనస్థితిగతులను మెరుగుపరుచుకోవాలని స్టేట్ ట్రైబల్ ప్రాజెక్ట్ మేనేజర్ సి.నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం శివపురం గూడెం సమీపంలో గిరిజనులు సాగు చేసిన 20 ఎకరాల మామిడి తోటలను శ్రీశైలం ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డితో కలసి పరిశీలించారు. వ్యవసాయం చేసుకోనేందుకు బోర్లు వేయించాలని గిరిజనులు అధికారులు కోరారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకంతో ఆర్థికంగా రాణించవచ్చునన్నారు. పండ్లతోటలలో అంతర పంటలను సాగు చేసుచేసుకుని ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. అంతర పంటలను సాగుచేసుకొనే గిరిజన రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఒక ఎకరాకు ప్రధానమంత్రి వన్‌దన్ పథకం ద్వారా 10 మొక్కలను ఇస్తుందన్నారు. వాటిని సాగు చేసుకొని 3 ఏళ్ల తర్వాత పంటను కోస్తే ఒక ఎకరాకు రూ.10 లక్షల దాకా ఆదా యం చేకూరుతుందన్నారు. వ్యవసాయ పొలాలకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో బోర్లు వేయిస్తామని, కుంటలకు దగ్గర ఉన్న పొలాల రైతులకు ఆయిల్ ఇంజన్లు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం పెద్దగుమ్మడాపురం గూడెంలో గిరిజనులతో ముఖాముఖీ మాట్లాడారు. గిరిజన నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తుందన్నారు. గిరిజనులు వారి పిల్లలను పనుల్లోకి పంపకుండా బాగా చదివించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిరికీ అందేలా చూస్తామన్నారు. వారి వెంట ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కె.జి.నాయక్, ఐటీడీఏ ఏపీఓ రాజ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్యూటీ పార్లర్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బ్యూటీ పార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లుగా ఆ సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి జూన్ 19 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చి ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో సంస్థలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కల్లూరు తహసీల్దారు కార్యాలయంపక్కన కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీ పైన(మూడవ అంతస్తు) సంప్రదించవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 9000710508 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.

టార్పాలిన్ లేకుండా ఇసుక రవాణా చేస్తే జరిమానా

కర్నూలు (న్యూటౌన్): ట్రాక్టర్లకు టార్పాలిన్ లేకుండా ఇసుక రవాణా చేస్తే రూ.5వేలు జరిమానా విధిస్తామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనలపై ట్రాక్టర్ డ్రైవర్లకు శుక్రవారం జిల్లా మైనింగ్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్, విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనుమతులు ఉన్న వారే ఇసుక రవాణా చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ట్రాక్టర్లను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

ఆసుపత్రి సిబ్బందిపై చెంచు గిరిజనుల దాడి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ వైద్యశాల సిబ్బందిపై శుక్రవారం మధ్యాహ్నం చెంచుగిరిజనులు దాడి చేశారు. సున్నిపెంటకు చెందిన చెంచు గిరిజనుడు కుడుముల అంజన్న(30) చెట్టుపై నుంచి కిందపడి తలకు తీవ్ర గాయంతో శుక్రవారం ఉదయం సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. గాయపడిన గిరిజనుడికి మెరుగైన వైద్యం అందించాల్సి ఉందని, ఇతర ప్రాంతంలో సిటీ స్కాన్ చేయించుకొని అక్కడే వైద్యం తీసుకోవాలని డాక్టర్ భార్గవ్ సూచించారు. సకాలంలో 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో కోపోద్రిక్తులైన చెంచుగిరిజనులు దుర్భాషలాడుతూ ఎంఎన్‌ఓ స్వాములు, సెక్యూరిటీ గార్డ్ ఉమామహేశ్వరిపై దాడికి పాల్పడ్డారని డీడీఓ డాక్టర్ సోహైల్ తెలిపారు. అయితే వాదోపవాదాలు చేసుకుంటున్న సమయంలో తమ రెండు సెల్‌ఫోన్‌లు వైద్య సిబ్బంది లాక్కొని పగులగొట్టడంతో దాడి చేశామని గిరిజనులు చెబుతున్నారు. కాగా గిరిజనుల దాడిని నిరసిస్తూ వైద్య సిబ్బంది ఆసుపత్రి ఎదుట బైటాయించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గంగయ్యయాదవ్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని ఇరు వర్గాల వారికి నచ్చజెప్పి రాజీ చేశారు.

రైల్వే స్టేషన్ యార్డులో మంటలు

బనగానపల్లె : బనగానపల్లె రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని యార్డులో శుక్రవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. అక్కడ ఉన్న చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు అంటించగా మంటలు చెలరేగాయి. వెంటనే ఫైర్ ఇంజిన్ అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేయడంతో రైల్వే అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. రైల్వే స్టేషన్‌లో ఎటువంటి ఆస్తినష్టం జరగలేదు. స్టేషన్ మాస్టర్ శ్రీను మాట్లాడుతూ ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలు ఆర్పివేయడంతో ఆ సమయంలో స్టేషన్ మీదుగా తిరిగే గూడ్స్‌కు ఎటువంటి అంతరాయం కలగలేదన్నారు.

చుక్క నీటికి.. చక్కటి ఫలితం

- సూక్ష్మసేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- రాయితీపై డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు
- తక్కువ నీటితో అధిక దిగుబడి
- ఈ ఏడాది డ్రిప్ లక్ష్యం 5వేల హెక్టార్లు
- రూ.20 కోట్ల రాయితీ ఇవ్వనున్న ప్రభుత్వం

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. అవసరమున్న ప్రతి రైతుకూ డ్రిప్, స్ప్రింక్లర్ల సదుపాయం కల్పిస్తోంది. గతంలో ఉద్యాన పంటలకు మాత్రమే ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేవారు. నేడు పత్తి, మిరప, వేరుశనగ, ఉల్లి, టమాట , అన్ని రకాల కూరగాయల పంటల్లో సూక్ష్మ సేద్యం వినియోగం పెరిగింది.



పొలంలో ఏర్పాటు చేసిన డ్రిప్పు పరికరం

బనగానపల్లె: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తోంది. సేద్యంలో నూతన విధానాలను ప్రోత్సహిస్తోంది. అధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకొని రైతులు సులువుగా సాగు చేసే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా బిందుసేద్యం పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తోంది. తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించేలా సహకారం అందిస్తోంది. ముఖ్యంగా మెట్టప్రాంత రైతంగానికి మరింత ఎక్కువ సబ్సిడీపై డ్రిప్పు సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చింది. అన్నదాతల అవసరాలకు అనుగుణంగా 5 వేల నుంచి 10 వేల ఎకరాలకు బిందు సేద్యం పరికరాలను అందజేయాలని లక్ష్యాలను నిర్దేశించింది

రైతన్నకు దన్నుగా..

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రైతుభరోసా, వైఎస్సార్‌బీమా సున్నావడ్డీ, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేస్తోంది. మార్కెట్‌లో ధరలు పడిపోయిన సందర్భంగా మద్దతుతో పంటల కొనుగోలు చేస్తోంది. అలాగే తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో పంటసాగు చేసేందుకు డ్రిప్పు ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తోంది. గతేడాది జిల్లాలో 4వేల హెక్టర్లు డ్రిప్పు పరికరాలను అందించాలనే లక్ష్యం పెట్టుకోగా.. 4500 హెక్టార్లకు అందజేశారు. జిల్లాలో 4,125 మంది రైతులు లబ్ధిపొందారు. రాయితీ రూపంలో ప్రభుత్వం రూ.17 కోట్లు వెచ్చించింది. ఈఏడాది 5వేల హెక్టార్లలో సుమారు 4వేల మంది రైతులకు డ్రిప్పు పరికరాలను పంపిణి చేయాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. ఇందు కోసం రాయితీ రూపంలో ప్రభుత్వం రూ.20కోట్లు కేటాయించనుంది. బిందు పరికరాల కోసం అర్హులైన, అవసరం ఉన్న రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ప్రారంభించారు. వ్యవసాయాధికారుల సుచనల మేరకు సన్న, చిన్నకారు రైతులు బిందు సేద్యంపై ఆసక్తి చూపుతున్నారు.

90 శాతం సబ్సిడీ

ఐదు ఎకరాలలోపు రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం సదుపాయాన్ని కల్పిస్తోంది. 5 ఎకరాలపైన నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం సబ్సిడీ లభిస్తోంది. స్ప్రింక్లర్లు అమర్చుకుంటే ఐదు ఎకరాలలోపు రైతులకు 50 శాతం, ఐదు ఎకరాలు పైబడిన రైతులకు 45 శాతం సబ్సిడీ లభిస్తుంది. బిందు, స్ప్రింక్లర్లు పరికరాలపై రాయితీ పొందడానికి రైతులు 1బీ రికార్డుతో రైతు భరోసా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. బిందు సేద్యం సదుపాయంతో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు గణనీయమైన దిగుబడులు సాధిస్తున్నారు. గతేడాది కొంత మంది రైతులు మిరప సాగును డ్రిప్ కింద చేపట్టారు. దీంతో మిరపలో రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చాయి. బిందు సేద్యంతో అన్ని పంటల్లోనూ దిగుబడులు 30 నుంచి 50 శాతం వరకు పెరిగాయి. పంట ఉత్పత్తులు నాణ్యతతో ఉండటంతో వాటికి మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తున్నాయి.

ఇవీ ప్రయోజనాలు..

- బోర్లు, బావుల్లోని తక్కువ నీరు ఉన్నా పంటలు సాగు చేసుకోవచ్చు.
- ఈ విధానంలో చుక్క నీరు కూడా వృథా కాదు.
- నీరు,,పోషకాలు సమపాలల్లో అంది మొక్క ఆరోగ్యంగా పెరుగుతంది.
- విద్యుత్ వినియోగం కూడా తక్కువగానే ఉంటుంది.
- పర్టిగేషన్ ద్వారా మొక్కకు నేరుగా ఎరువులు ఇచ్చే అవకాశం ఉంది.
- నీటి బిందువులు మొక్కల మొదళ్ల దగ్గర మాత్రమే పడుతుండటం వల్ల కలుపు సమస్య ఉండదు.
- తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

ఎంతో ఉపయోగకరం



పది ఎకరాల్లో అరటి, మూడు ఎకరాల్లో దానిమ్మ పంటను బిందు ద్వారా సాగు చేసి మంచి దిగుబడి సాధించాను. ఈ సంవత్సరం కూడా వీలు ను బట్టి పంట మార్పిడితో ఇతర పంటలను సాగు చేస్తాను. బిందు సేద్యంలో నీటి పొదుపు ఎక్కువగా ఉంటుంది. మొక్కకు ఎంత నీరు అవసరమో అంతే లభిస్తుంది. పంటలకు జీవామృతాన్ని బిందు సేద్యం ద్వారానే అందిస్తున్నాం. కూలీల సమస్య ఉండదు. పెట్టుబడి తక్కువగా ఉంటుంది.

–రామచంద్రారెడ్డి, రైతు, సుంకేసుల,అవుకు మండలం

అధిక దిగుబడి వస్తుంది



యాగంటిపల్లె వద్ద ఉన్న నాలుగున్నర ఎకరాల పొలంలో 9 నెలల క్రితం డ్రిప్పు సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకున్నా. గత సంవత్సరం బొప్పాయి పంటలో మంచిదిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం మిరప పంట సాగు చేస్తాను. పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడి లభిస్తుంది. డ్రిప్పు ద్వారా రూ. లక్ష సబ్సిడీ వచ్చింది. బిందు సేద్యంతో తక్కువ నీటి వినియోగంతో పంటలను సాగు చేయవచ్చు.

– తులసి వెంకటేశ్వరరెడ్డి, బనగానపల్లె

అవసరం ఉన్న ప్రతి రైతుకూ అందిస్తాం



జిల్లాలో సూక్ష్మ సేద్యం సాగులో మంచి ఫలితాలు వస్తున్నాయి. డ్రిప్ కింద దిగుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి. రైతులకు నికరాదాయం వస్తోంది. అవసరం ఉన్న ప్రతి రైతుకూ డ్రిప్ మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. నీటి కొరతను అధిగమించేందుకు బిందు సేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

– శివసత్యనారాయణ, జిల్లా మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్

మొజాయిక్‌చిప్స్ అక్రమంగా తరలిస్తున్న లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామం నుంచి బెంగళూరుకు కోళ్లదాణాకు ఉపయోగించే మొజాయిక్‌చిప్స్ అక్రమంగా తరలిస్తున్న లారీని, డోలమైట్ అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం డోన్ ప్రాంతంలో జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ.. చిన్న మల్కాపురం నుంచి బెంగళూరుకు అక్రమంగా మొజాయిక్ చిప్స్ తరలిస్తున్న లారీకి రూ.50వేలు, రాయల్టీ లేకుండా డోలమైట్ ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌కు రూ.7,500 మొత్తం రూ.57,500 అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సెబ్ అధికారుల విస్తృత తనిఖీలు



అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన సెబ్ పోలీసులు

కర్నూలు:మద్యం, ఇసుక అక్రమ రవాణా, సారా తయారీ, విక్రయాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) అధికారులు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 7 సెబ్ స్టేషన్లు, 7 చెక్‌పోస్టులు ఉన్నాయి. పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 417 మద్యం బాటిళ్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేసి రెండు ట్రాక్టర్లను జప్తు చేసి రూ.24 వేలు అపరాధ రుసుం వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఇసుకను కూడా సీజ్ చేసినట్లు తెలిపారు. ఆదోని సెబ్ స్టేషన్ పరిధిలో హైకోర్టు అనుమతితో ఇసుకను తరలిస్తున్నప్పటికీ టార్పాలిన్ కప్పుకోకుండా నిబంధనలు ఉల్లంఘించినందుకుగాను ఇసుక టిప్పర్, ట్రాక్టర్‌ను సీజ్ చేసి భూగర్భ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు తదుపరి చర్యల నిమిత్తం అప్పగించినట్లు తెలిపారు. అలాగే సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 45 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశామన్నారు. ఒక వ్యక్తి నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సెబ్ సూపరింటెండెంట్ తెలిపారు.

తండ్రి చేతిలో కొడుకు హతం

డొర్నిపాడు: తండ్రి చేతిలో కొడుకు దారుణ హత్యకు గురైన ఘటన డొర్నిపాడులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా.. డొర్నిపాడుకు చెందిన చాకలి వెంకటరమణ (27) రోజు మద్యం సేవించి డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధించేవాడు. గురువారం రాత్రి కూడా తల్లి సుబ్బమ్మను వేధిస్తుండడంతో తండ్రి బాలవెంకటయ్య కుమారుడిని మందలించాడు. దీంతో కోపానికి గురైన కొడుకు తండ్రి బాలవెంకటయ్యపై తిరగబడ్డాడు. ఈ ఘర్షణలో పక్కనే ఉన్న కర్ర తీసుకుని కొడుకు తలపై కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటరమణను వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య నాగేశ్వరి, కూతురు ఉన్నారు. రూరల్ సీఐ హనుమంతునాయక్ గ్రామానికి చేరుకుని హత్యపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



మృతిచెందిన రాముడు

ఆదోనిఅర్బన్: ఆలూరు పట్టణానికి చెందిన రాముడు(54) మద్యానికి బానిసై క్షణికావేశంలో పురుగు మందు తాగి మృతిచెందాడు. బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాముడు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసై క్షణికావేశంతో గురువారం పురుగుమందు తాగాడు. వెంటనే ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య రాములమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నా రు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిరుధాన్యాల సాగు లాభసాటి

నంద్యాల(సెంట్రల్): మేలైన వంగడాలు యాజమాన్య పద్ధతులతో చిరుధాన్యాల సాగులో మంచి లాభాలు పొందవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకురాలు డా. సరళమ్మ అన్నారు. శుక్రవారం పరిశోధనా స్థానం ప్రాంగణంలో అఖిలభారత చిరుధాన్యాల సమన్వయ మరియు పరిశోధన పథకం ఆధ్వర్యంలో ఎస్సీ సబ్ ప్లాన్ లో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ మాట్లాడుతూ.. చిరుధాన్యాలను ప్రత్యామ్నాయ పంటగా సాగు చేసుకోవచ్చని, అన్ని కాలాలకు అనువైన పంటలుగా వీటిని ఎంచుకోవచ్చని తెలిపారు. సస్య విజ్ఞానం శాస్త్రవేత్త డాక్టర్ నరసింహులు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకట రమణమ్మ మాట్లాడుతూ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి విడుదలైన పలు వంగడాలు, సాగు మెలకువలు చీడపీడల నిర్మూలనపై పలు సూచనలు చేశారు. డాక్టర్ పులి బా య్, జ్యోత్స్న జొన్నలో రకాలను గురించి యాజ మాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

- ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : విధి నిర్వహణలో ప్రజలకు అందించే సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో సుదీర్ఘకాలం పనిచేసిన తొమ్మిది మంది పదవీ విరమణ పొందారు. ఎస్‌ఐలు డి.రాజన్న, అబ్దుల్ అజీజ్, జాఫర్ హుసేన్, రామిరెడ్డి, ఏఆర్‌ఎస్‌ఐ చంద్రశేఖర్‌రావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు చెంచయ్య, హరిబాబు, ఏఎస్‌ఐలు ఇన్నయ్య, నజీర్ అహ్మద్ తదితరులు శుక్రవారం పదవీ విరమణ పొందారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో వారికి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి ఎస్పీ చేతుల మీదుగా జ్ఞాపికలను అందించారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలను ఎస్పీ కొనియాడారు. పదవీ విరమణకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తనను సంప్రదించవచ్చునని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు, ఎస్‌బీ సీఐ నాగరాజు యాదవ్, ఆర్‌ఐలు జావెద్, నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, పదవీ విరమణ పొందిన పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పోలీసు శాఖలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్



పదవీ విరమణ పొందిన శ్రీనివాసరావును సత్కరిస్తున్న అడిషనల్ కమాండెంట్ ప్రభుకుమార్

ఏపీఎస్పీ కమాండెంట్‌కు ఘనంగా వీడ్కోలు...

ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, భాగ్యలత దంపతులకు శాలువా కప్పి పూలమాలలు వేసి జ్ఞాపికతో సత్కరించి పటాలం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి రిటైర్డ్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు కూడా హాజరయ్యారు. అదనపు కమాండెంట్ ప్రభుకుమార్‌కు కమాండెంట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

కర్నూలు : కర్నూలు నగరం మద్దూర్ నగర్‌లో ట్రాక్టర్‌లోని మట్టిని అన్‌లోడ్ చేస్తూ అదుపు తప్పి కింద పడి గాయాలకు గురై డ్రైవర్ బీచుపల్లి (40) మృతిచెందాడు. మానవపాడు మండలానికి చెందిన బీచుపల్లి శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌తో మట్టి తెచ్చి కర్నూలులోని మద్దూర్ నగర్‌లో అన్‌లోడ్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అదుపు తప్పి కింద పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య సుజాతతో పాటు కొడుకు, కూతురు సంతానం. మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గురు రాఘవేంద్ర నగర్‌లో చోరీ...

కర్నూలు శివారులోని కోడుమూరు రోడ్డులో ఉన్న గురు రాఘవేంద్ర నగర్‌లో నివాసముంటున్న సుంకన్న ఇంట్లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. సుంకన్న డోన్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16వ తేదీన ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. ఇదే అదునుగా భావించి దొంగలు ఇంట్లో చొరబడి 20 తులాల బంగారు నగలను మూటకట్టుకుని ఉడాయించారు. ఆలస్యంగా గుర్తించిన సుంకన్న శుక్రవారం నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మాధవీనగర్‌లోని శ్రావణి ట్రేడర్స్‌లో కూడా దొంగలు చేతివాటం ప్రదర్శించి రూ.20 వేలు నగదును మూటకట్టుకుని ఉడాయించారు. ఈ మేరకు దుకాణం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొని స్వామివారి పల్లకిని మోస్తూ భక్తిని చాటుకున్నారు. అలాగే మహానంది క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులు నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. శుక్రవారం వేలాది సంఖ్యలో భక్తులు కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు.

కర్నూలు ఫారెస్ట్ డీఆర్‌ఓగా లక్ష్మయ్య

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ కర్నూలు డివిజన్ హెడ్ క్వార్టర్ డీఆర్‌ఓగా నగరవనం డీఆర్‌వో లక్ష్మయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ డీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న పీరయ్య శుక్రవారం పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో లక్ష్మయ్యకు బాధ్యతలు అప్పగించారు. నంద్యాల సోషల్ ఫారెస్ట్ రేంజర్ డీఎన్‌కే ప్రసాద్‌కు కర్నూలు సోషల్ ఫారెస్ట్ స్క్వాడ్ రేంజర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆదోని ఎఫ్‌ఆర్‌ఓ తేజశ్వి వ్యక్తిగత సెలవులో వెళ్లడంతో ఆమె స్థానంలో పత్తికొండ డీఆర్‌ఓ రామచంద్రుడుకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.

తండ్రిపై కుమారుల దాడి

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలో గురువారం రాత్రి తండ్రి నాగప్పపై కుమారులు ప్రకాష్, మస్తాన్‌తో పాటు మరో ముగ్గురు దాడి చేసి గాయపరిచినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప శుక్రవారం విలేకరులకు తెలిపారు. తండ్రి, కొడుకులు మధ్య ఆస్తి పంపకాల్లో విభేదాలు ఉన్నాయన్నారు. వాటిని మనసులో ఉంచుకుని కొడకులు, మరో ముగ్గురు నాగప్పపై దాడి చేశారన్నారు. నాగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుక్కను తప్పించబోయి..

- అదుపు తప్పిన బైక్
- విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జూపాడుబంగ్లా: కర్నూలు – ఆత్మకూరు రహదారిపై తంగడంచ చెక్‌పోస్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. పారుమంచాల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (40), నాగేశ్వరరావు శుక్రవారం సొంత పనుల నిమిత్తం బైక్‌పై జూపాడుబంగ్లాకు చేరుకున్నారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో తంగడంచ చెక్‌పోస్టు మలుపు వద్దకు కుక్క అడ్డురావడంతో తప్పించబోయి అతివేగంగా రోడ్డుపక్కనున్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన్నారు. బైక్ నడుపుతున్న వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చొన్న నాగేశ్వరరావు తలకు తీవ్రగాయం కావడంతో 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకొన్న ఏఎస్‌ఐ మేరీ జయంతి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య శ్యామలమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. ఇతని స్వగ్రామం కర్నూలు పట్టణం బుధవారపేట కాగా మూడేళ్లుగా భార్య పుట్టినిల్లు అయిన పారుమంచాలలో ఉంటూ జీవిస్తున్నాడు. కుటుంబ జీవనాధారమైన భర్త మృతిచెందటంతో మృతునిభార్య, బంధువుల రోదనలు మిన్నంటాయి.